కల్యాణోత్సవాలు.. వార్షిక బ్రహ్మోత్సవాలతో దక్షిణలోని పలు ఆలయాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనున్నాయి. నేటి నుంచి వారం రోజుల పాటు ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి, పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి, సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులో వెలసిన విశ్వేశ్వరస్వామి, కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి వార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. హోమాలు.. యజ్ఞాలు నిర్వహించనున్నారు. కనుల పండువగా జరగనున్న ఈ మహోత్సవాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొననున్నారు.

ఆధ్యాత్మిక శోభ

- నేటి నుంచి దక్షిణలో పలు దేవాలయాల వార్షికోత్సవాలు.. దివ్య కల్యాణోత్సవాలు.. బ్రహ్మోత్సవాల నిర్వహణ
- భక్తులతో కళకళలాడనున్న ఇసుకకొండ, శృంగమణి పర్వతం, అంబికాబాగ్ పుణ్యక్షేత్రాలు


ఇసుక కొండ సత్యనారాయణస్వామి ఆలయం

డాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గం సోమవారం నుంచి వారం రోజుల పాటు ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. ప్రతి ఏటా జ్యేష్ఠ శుద్ధ పంచమి రోజున పలు దేవాలయాల వార్షికోత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా ఈ నెల 17 నుంచి 23 వరకు నిర్వహించనున్నారు. 17 సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కల్యాణోత్సవాలు ప్రారంభించనున్నారు. అనంతరం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణ, వాస్తు యోగీశ్వర మండలారాధన, అగ్ని ప్రతిష్టాపన, హోమాలు నిర్వహించనున్నారు. అలా 23వ తేదీ వరకు ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

పోర్టు వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవం


పోర్టు వేంకటేశ్వరస్వామి ఆలయం

పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వర స్వామి తిరు కల్యాణ మహోత్సవాలు ఈ నెల 17 నుంచి 23 వరకు నిర్వహించనున్నారు. జ్యేష్ఠ శుద్ధ దశమి నుంచి ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 17 ఉదయం 5 గంటలకు సుప్రభాతం, ఆరాధన హోమాలు, సాయంత్రం 6 గంటలకు ఋత్విగ్వరణం, మృత్యం గ్రహణం, అంకురార్పణ, విశేష హోమాలు నిర్వహించనున్నారు. అలా 23వ తేదీ వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్వామి కల్యాణంలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించాలి. ముందుగా 7989709244 నంబరులో సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయి. 29 మధ్యాహ్నం 12 గంటలకు మహాన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు.

విశ్వేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు


సూర్యాబాగ్ విశ్వేశ్వరస్వామి ఆలయం

సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులో వెలసిన విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి వార్షిక కల్యాణ మహోత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. 17న మండపారాధన, త్రిశూల పూజ, సాయంత్రం విశ్వేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరీదేవి కల్యాణ మహోత్సవం, 18, 19, 20 తేదీల్లో ప్రత్యేక హోమాలు, 21 సాయంత్రం 5 గంటలకు నాగవల్లి శేష హోమం, 22న హోమాలు, ఆ రోజు రాత్రి 8.30 గంటలకు పుష్పాంజలి సేవ ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నసమారాధన జరపనున్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా లలిత, విష్ణు సహస్రనామ పారాయణ ఏర్పాటు చేశారు.

సీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు


అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం

కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి (మహారాణిపేటలో గల అంబికాబాగ్) ఆలయంలో ఈ నెల 17 నుంచి వారం రోజుల పాటు స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. 17 సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవ సంకల్పం, ధ్వజారోహణం, 18 ఉదయం విశేష హోమాల అనంతరం 10.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం, సాయంత్రం విశేష హోమాలు, 19 సాయంత్రం మహాశాంతి హోమం, 20 సాయంత్రం వైదిక సదస్యం, తిరువీధి ఉత్సవం, 21 ఉదయం చూర్ణోత్సవం, అవభృదోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి, సాయంత్రం ధ్వజావరోహణం, 22 సాయంత్రం 6 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం, పవళింపు సేవ నిర్వహించనున్నారు. స్వామి కల్యాణంలో పాల్గొనదలచే భక్తులు రూ.300 చెల్లించి పాల్గొనవచ్చు.

ఎర్నిమాంబ అమ్మవారికి దశమి పూజలు


ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం జ్యేష్ఠమాస శుద్ధ దశమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 దర్శనాలు కల్పించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భారీ ఎత్తున ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సౌకర్యాలు కల్పించారు. అమ్మవారికి పూజల సందర్భంగా ఈ ప్రాంతం సందడిగా మారింది.

క్లుప్తంగా

అలరించిన సినీ సంగీత విభావరి


సినీ సంగీత విభావరిలో పాల్గొన్న గాయనీ గాయకులు, అతిథులు

డాబాగార్డెన్స్ : అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన సినీ సంగీత విభావరి అలరించింది. విజయనగరానికి చెందిన మ్యూజిక్ స్క్వాడ్ సరిగమప ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నో ప్రయాసలతో సినీ సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. వర్ధమాన గాయకులు పి. రాంబాబు, పూర్ణిమ, సీహెచ్‌వీ సత్యనారాయణ, శైలజా మీరజ్, భాగ్యలక్ష్మి, పుండరీకుమార్, రామరాజు, కందర్ప రాధ తదితరులు పలు తెలుగు చిత్రాల్లోని మధుర గీతాలు ఆలపించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. లక్ష్మీ స్వరూప వ్యాఖ్యాతగా వ్యవహరించగా కొణతాల రాజు, చెన్నా తిరుమల రావు, జేఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్ అక్రమాలపై ప్రధాని మోదీ స్పందించాలి'

మహారాణిపేట : నీట్–2024 అక్రమాలపై ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే స్పందించాలని, పరీక్షలు రాసి తీవ్ర గందరగోళంలో ఉన్న 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్పష్టమైన ప్రకటన చేయాలని జనజాగరణ సమితి డిమాండ్ చేసింది. ఒకవైపు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేపర్ లీకేజీ జరగలేదని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తుంటే మరొక వైపు బీహార్‌లో పేపర్ లీకేజీ నిందితులు పట్టుబడటం ఏమిటో అర్థం కావటంలేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో నీట్ పేపర్‌ను ఒక్కొక్క విద్యార్థికి రూ. 32 లక్షలకు పేపర్ లీకేజీ ముఠాలు అమ్ముకోవడం వంటి ఘటనలను గమనిస్తున్నామని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు నీట్–2024 పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయన్నారు. విద్యార్థుల్లో ఆందోళన తొలగించే ప్రయత్నం చేయాల్సిన ప్రధాని మోదీ ఇంత వరకు స్పందించకపోవడం పట్ల విద్యార్థి లోకం ఆవేదనలో ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలు రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో నీట్ పరీక్ష అక్రమాలపై పెద్ద ఎత్తున ఆందోళన చేయక ముందే ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు.

నేడు బక్రీద్ వేడుకలు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని మస్జీద్ ఈ అల్ ఖదీర్ వద్ద సోమవారం బక్రీద్ వేడుకలు నిర్వహిస్తున్నట్టు మసీద్ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వేకువ జామున 5.30 గంటలకు ఫజర్ నమాజ్ ఆచరించి, శాంతి ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం 7.30 గంటలకు అక్కడే ఉన్న బరియల్ గ్రౌండ్ సమీపంలో ఈద్ నమాజ్ ఆచరిస్తామన్నారు. నమాజ్ అనంతరం పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు చేసి తర్వాత కుర్బానీ ఇస్తారని సభ్యులు పేర్కొన్నారు.

యువకుడిని కాపాడిన ఎంవీపీ పోలీసులు

ఎంవీపీ కాలనీ : కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడేందుకు ప్రయత్నించిన ఓ యువకుడిని ఎంవీపీ పోలీసులు కాపాడారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమిలి మండలం ఉప్పాడకు చెందిన మామిడి సంతోష్ (30) కుటుంబ కలహాల కారణంగా ఆదివారం అప్పుఘర్ సముద్ర తీరంలో ఆత్మహత్యకు ప్రయత్నించాడు. దీనిపై కుటుంబ సభ్యుల సమాచారంతో అప్పుఘర్ తీరానికి చేరుకున్న పోలీసులు.. ఆయన ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. అనంతరం అతని భార్యకు సమాచారం అందించారు. దీంతో సంతోష్ భార్య పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు


తండ్రులను సత్కరిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, సంస్థ సభ్యులు


వైద్య శిబిరంలో వృద్ధురాలికి కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

డాబాగార్డెన్స్ : పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో ఆశ్రయం పొందుతున్న తండ్రులు సీహెచ్ సూర్యనారాయణ, నాగేశ్వర రావును ఆదివారం ఘనంగా సత్కరించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు వారిని సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జహీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మనకి జీవితాన్నిచ్చిన తల్లిదండ్రులను గౌరవించాలని, ఫాదర్స్ డే సందర్భంగా ఈ తండ్రులను సన్మానించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎంతో మంది తల్లిదండ్రులకు ఆశ్రయం కల్పిస్తూ, వారికి భరోసాగా నిలిచిన సంస్థను, సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పోలవరపు అప్పలకొండ, సోంబాబు, మహిళా సభ్యులు ఉమాదేవి, రాణి, రత్న, సుజాత, ట్యూషన్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

స్వామి వివేకానంద సంస్థ, శంకర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 200 మందికి పైగా పరీక్షలు చేయించుకున్నారు. 50 మందికి శస్త్ర చికిత్స అవసరం కాగా వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నారు. డాక్టర్ జహీర్ అహ్మద్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పలువురికి తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, డాక్టర్ కృష్ణ, చాందిని, శాంతి, సౌజన్య, లత, క్యాంపు కో ఆర్డినేటర్ వై. రాజు, సంస్థ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు కూలిన చెట్టు కొమ్మలు


సీతమ్మధార వాటర్ వర్క్స్ కార్యాలయం ఎదుట రోడ్డుపై కూలిన చెట్టుకొమ్మలు

సీతమ్మధార: సీతమ్మధారలోని పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. రోడ్లపై అడ్డంగా కొమ్మలు విరిగిపడి ఉండటంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. కూలిన చెట్టు కొమ్మలను సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద రోడ్డుపై పడివేశారు. స్థానికులతోపాటు అటు వైపు రాకపోకలు సాగిస్తున్న కార్లు, ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ఇబ్బందికరంగా మారింది. అదే రోడ్డులో కార్లు పార్క్‌చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి చెట్టు కొమ్మలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

తీరుమారని స్క్రాప్ వ్యాపారులు

- రహదారిలోనే వాహనాల పార్కింగ్
- ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు.. పాదచారులు


ఇందిరా మున్సిపల్ స్టేడియం ఎదురుగా అనధికారికంగా పార్క్ చేసిన స్క్రాప్ వాహనాలు

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు పరిధి ఇందిరా మున్సిపల్ క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న స్క్రాప్ వ్యాపారుల తీరు మారలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో వీరు అనధికారికంగా దుకాణాలు నిర్వహిస్తున్నారు. స్టేడియం స్థలం, ప్రధాన రహదారిని సైతం తమ వ్యాపార కార్యకలాపాలకు ఉపయోగించుకుంటున్నారు. అలాగే పోర్టుకు వెళ్లే రహదారిలో తమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే రహదారికి ఇరువైపులా తమ స్క్రాప్ సామగ్రి వేస్తున్నారు. దీనివల్ల ఇబ్బందులకు గురవుతున్నామని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు.

పేపర్లు లేని వాహనాలే ఎక్కువ..

ఇటీవల పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ ఆదేశాల మేరకు వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీసులు ఇక్కడి వాహనాలు తనిఖీ చేశారు. స్టేడియం పక్కన ఉన్న పదుల సంఖ్యలోని స్క్రాప్ వాహనాలు చూసి సీపీ ఆదేశాల మేరకు వాహనాలకు సంబంధించిన పేపర్లు తీసుకు రావాలని వ్యాపారులను ఆదేశించారు. అలాగే ప్రధాన రహదారి పక్కన వాహనాలు నిలుపరాదని హెచ్చరికలు జారీ చేశారు. కానీ వ్యాపారులు సీపీ ఆదేశాలు బేఖాతరు చేశారు. ఇప్పటికి ఇరవై రోజులు పైబడినా వారు కనీసం స్పందించలేదు.

నేటి నుంచి పైడిమాంబ ఉత్సవాలు


పైడిమాంబ అమ్మవారు


ముస్తాబైన పైడిమాంబ ఆలయం

కంచరపాలెం: పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలను సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు రాము, శంకర్ తెలిపారు. సోమవారం తొలేళ్ల సంబరం, 18న మంగళవారం ప్రధాన జాతర నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం ప్రధాన జాతర ఆలయం నుంచి అమ్మవారి ప్రతిమలతో ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో అర్చకులు పులకండం శ్రీనివాసశర్మ, పూజారి పిల్లి చంద్రశేఖర్, వెంకటరెడ్డి, సభ్యులు రమణ, సూరిబాబు, రామకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహస్వామికి వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం : వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ కార్యక్రమ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

– శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అర్చకులు ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. భక్తులు స్వామి వారి నిత్య కల్యాణాన్ని వీక్షించి కనులారా వీక్షించి ఆనందపరవశులయ్యారు.

సందడిగా కైలాసగిరి


కైలాసగిరిపై గుర్రపు స్వారీ చేస్తున్న చిన్నారులు



ప్రత్యేక ఆకర్షణగా ఐ లవ్ కైలాసగిరి వ్యూ పాయింట్


9డీ సినిమా థియేటర్ వద్ద సందర్శకులు

ఆరిలోవ: కైలాసగిరికి రెండు రోజుల నుంచి సందర్శకుల తాకిడి పెరిగింది. అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చి ఇక్కడ పచ్చని మైదానాలు, పిల్లలు ఆట స్థలాలు, పరికరాల వద్ద సందడి చేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన ఐ లవ్ కైలాసగిరి వ్యూ పాయింట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వ్యూ పాయింట్ వద్ద ప్రస్తుతం పనులు జరుగుతుండడంతో సందర్శకులు దూరంగా నిల్చుని ఫొటోలు దిగారు. ఈ వ్యూ పాయింట్ నుంచి సముద్ర తీరం, బీచ్ రోడ్డు అందాలు రుషికొండ వరకు కనిపిస్తున్నాయి. దీంతో ఇక్కడ సెల్ఫీలు తీసుకుంటూ ముచ్చటపడుతున్నారు. కొండపై శివపార్వతుల విగ్రహాల పక్కనే ఈ వ్యూ పాయింట్ ఏర్పాటు చేశారు. కైలాసగిరిపై ప్రధాన ద్వారం వద్ద ఇటీవల '9డీ'సినిమా థియేటర్ ఏర్పాటు చేశారు. ఈ థియేటర్ మరింత సందడిగా మారింది. ఇందులో 10 నిమిషాల పాటు వేసే 9డీ సినిమాను పిల్లలు, పెద్దలు చూడడానికి ఆసక్తి కనబరిచారు. ఈ 9డి సినిమాలో 6 ఫిల్మ్‌లు ఉంటాయి. వాటిలో ఏది కావాలంటే ఆ ఫిల్మ్ చూపుతారు. 3డీ సినిమా మాదిరిగా మరింత డెవెలప్‌మెంట్‌తో ప్రేక్షకులు మెచ్చేలా 9డీ సినిమా ప్రదర్శిస్తున్నారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

పెదగంట్యాడ: హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో గల వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన దేవాలయం ద్వితీయ వార్షికోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మొగలపల్లి త్రిమూర్తులు, కొల్లా అప్పలరాజు, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

బాల సాహిత్యావిష్కరణకు కృషి


నాగశిరీషకు బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు

సీతంపేట: బాలబాట బాలల మాసపత్రిక బాలల నాటిక పోటీ బహుమతుల ప్రదానోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా బాలబాట సంపాదకురాలు స్వరాజ్యం వెంకట రమణమ్మ మాట్లాడుతూ బాలల కోసం, బాలల చేత మాసపత్రిక ప్రచురిస్తున్నట్టు తెలిపారు. బాల సాహిత్యం, బాలల కోసం కథలు, రచనలు మరిన్ని రావాలన్నారు. రచయితలు కూడా బాలల కోసం మరిన్ని రచనలు చేయాలని కోరారు. విద్యార్థి దశలోనే బాలలకు సాహిత్యంపై ఆసక్తి కల్పించేలా పాఠశాల స్థాయిలో కథలు, కవితలు రచించేలా ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం పోటీల్లో ప్రథమ బహుమతి ఎస్.మంగరత్నం (కాకినాడ), ద్వితీయ బహుమతి సింహాద్రి నాగశిరీష (హైదరాబాద్), తృతీయ బహుమతి సాధించిన సీహెచ్ చిన సూర్యనారాయణకు బహుమతుల ప్రదానం, నగదు పురస్కారాలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. పాణ్యం దత్త శర్మ, గంపా శ్రీదేవి, ఎం.సుగుణరావు, ఓట్ర ప్రకాశరావు, పి.వి.శేషారత్నంకు ప్రత్యేక బహుమతులు అందించారు. కార్యక్రమంలో నాటక కర్త నవరసమూర్తి, రచయిత కొలచిన రామజగన్నాథ్, ప్రొఫెసర్ అయ్యగారి సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న కనక మహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రాంబాబు

సీతంపేట: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ విధిగా రక్తదానం చేయాలని కనక మహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు పిలుపునిచ్చారు. బ్యాంకు స్థాపించి 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం అక్కయ్యపాలెంలోని ప్రధాన కార్యాలయంలో రజతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. చైర్మన్ రాంబాబు, ఏయూ మాజీ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమా మహేశ్వరరావుతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ పలువురికి ప్రాణదానం కల్పించే ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసిన బ్యాంకు యాజమన్యాన్ని అభినందించారు. బ్యాంకు ఖాతాదారులు, సిబ్బంది, శ్రేయోభిలాషులకు లీ ఫార్మా వారిచే బీపీ, సుగర్, ఎముకల పటుత్వం వంటి పరీక్షలు నిర్వహించారు. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. బ్యాంకు సీఈవో కె.శ్యామ్‌కిషోర్, డైరెక్టర్లు డాక్టర్ మోటూరి శ్రీరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.